సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 501 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
41.9°/23.6°

జిల్లావ్యాప్తంగా మంగళవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వింటా ఎండుమిర్చి రూ.18,500



మార్కెట్‌కు వచ్చిన మిర్చి

హిందూపురం అర్బన్‌: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం క్వింటా ఎండు మిర్చి రూ.18,500 పలికింది. మార్కెట్‌కు 62 క్వింటాళ్ల సరుకు రాగా, అధికారులు ఈ–నామ్‌ పద్ధతిలో వేలం వేశారు. ఇందులో మొదటి రకం క్వింటా రూ.18,500, రెండో రకం రూ.13 వేలు, మూడో రకం క్వింటా ఎండుమిర్చి రూ.7,200 ప్రకారం క్రయవిక్రయాలు సాగినట్లు మార్కెట్‌ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

కాంగ్రెస్‌కు నాగరాజారెడ్డి రాజీనామా

- త్వరలోనే వైఎస్సార్‌ సీపీలో చేరనున్న మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే టీడీ నాగరాజారెడ్డి

నల్లమాడ: ఆల్‌ ఇండియా కాంగ్రెస్‌ కమిటీ (ఏఐసీసీ) సభ్యుడు, నల్లమాడ పూర్వపు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే టీడీ నాగరాజారెడ్డి మంగళవారం కాంగ్రెస్‌ పార్టీకి రాజీనామా చేశారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయన వైఎస్సార్‌ సీపీలో చేరనున్నారు. ఈ మేరకు రెడ్డిపల్లిలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు ఫ్యాక్స్‌ ద్వారా తన రాజీనామా పత్రాన్ని పంపానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చడంతో పాటు తాతల కాలం నుంచి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట కుటుంబంతో ఉన్న సత్సంబంధాల నేపథ్యంలో వైఎస్సార్‌ సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు నాగరాజారెడ్డి తెలిపారు. నాగరాజారెడ్డి 1994 నుంచి 1999 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. కాగా, నాగరాజారెడ్డి వైఎస్సార్‌ సీపీలో చేరనున్నట్లు తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌ సీపీ నాయకులు ఆయన నివాసానికి చేరుకుని అభినందనలు తెలిపారు. జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ ఎం.నరసింహులు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కె.రవిచంద్రారెడ్డి, అమడగూరు ఇన్‌చార్జ్‌ నర్సిరెడ్డి, డాక్టర్‌ బొగ్గు సురేష్‌, టీడీ విజయశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌ కుళ్లాయప్ప, మాజీ సర్పంచ్‌ ప్రతాప్‌రెడ్డి, ఉంట్ల లక్ష్మీపతిరెడ్డి, బీసీ సెల్‌ మండల అధ్యక్షులు రవిప్రకాష్‌, మైనార్టీ సెల్‌ ఉపాధ్యక్షులు హబీబుల్లా, ఓబిరెడ్డి, రామచంద్ర, అరవిందరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, యర్ర సూరి, శంకర్‌రెడ్డి, బయపరెడ్డి, పురుషోత్తంరెడ్డి, రంగప్ప, టీడీ జగదీష్‌రెడ్డి తదితర నాయకులు నాగరాజారెడ్డిని అభినందించిన వారిలో ఉన్నారు.

నామినేషనోత్సాహం



నామినేషన్‌ దాఖలు చేస్తున్న ఈరలక్కప్ప

సామాన్యుడి కోసం ప్రజానీకం కదిలొచ్చింది. ఉపాధి కూలీని చట్టసభలకు పంపేందుకు మడకశిరలో కదం తొక్కింది. జగన్‌ సంకల్పాన్ని నెరవేర్చేందుకు మేమంతా సిద్ధమంటూ నినదించింది. వైఎస్సార్‌ సీపీ జెండాను రెపరెపలాడిస్తూ విజయనాదం చేసింది. వైఎస్సార్‌ సీపీ అభ్యర్థిగా ఈరలక్కప్ప నామినేషన్‌ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా సాగింది.

- అట్టహాసంగా ఈరలక్కప్ప నామినేషన్‌
- వేలాది మందితో మడకశిరలో భారీ ర్యాలీ
- మార్మోగిన 'జై జగన్‌' నినాదాలు
- రెపరెపలాడిన వైఎస్సార్‌ సీపీ జెండాలు



ఈరలక్కప్ప నామినేషన్‌ ర్యాలీలో పాల్గొన్న అశేష జన సందోహం

మడకశిర: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప నామినేషన్‌ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా సాగింది. కార్యకర్తలు, నాయకులు, స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజల ఆశీస్సులతో తన నామినేషన్‌ పత్రాన్ని ఆర్‌ఓ గౌరీశంకర్‌రావుకు అందించారు. అంతకుముందు పట్టణంలో వేలాది మంది వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్‌, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌ నిశ్చల్‌, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్‌, ప్రసాద్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ నళిని, మడకశిర అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్‌ అనంతరాజు, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్దన్‌ రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్‌, వాగేష్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్‌, బీసీ సెల్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, ఈరలక్కప్ప తల్లి కదురమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిన్నంటిన జగన్నినాదం..

నామినేషన్‌ సందర్భంగా ఈరలక్కప్ప పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వాల్మీకి సర్కిల్‌ నుంచి ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్‌, రాజీవ్‌గాంధీ, వైఎస్సార్‌ సర్కిళ్ల మీదుగా తహసీల్దార్‌ కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీ సందర్భంగా వాల్మీకి, అంబేడ్కర్‌ విగ్రహాలకు వైఎస్సార్‌ సీపీ నాయకులు, ఈరలక్కప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు 'జై జగన్‌' అంటూ నినదించగా.. మడకశిర ప్రతిధ్వనించింది. డీజే వాహనం ముందు కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో 'మానమ్మకం నువ్వే జగన్‌' అంటూ నృత్యాలు చేశారు. వాల్మీకి సర్కిల్‌ నుంచి తహసీల్దార్‌ కార్యాలయం వరకు దాదాపు రెండున్నర కిలో మీటర్ల పొడవునా జనం కిక్కిరిసిపోయారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో నాయకులు నిలబడి ప్రజలు, కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్లు, జేసీఎస్‌ కన్వీనర్లు, సింగిల్‌ విండో అధ్యక్షులు, కౌన్సిలర్లు, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్‌, పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్‌, ప్రసాద్‌రెడ్డి తదితరులు

ఈరలక్కప్ప గెలుపు ఖాయం

- మడకశిర విజయాన్ని జగన్‌కు బహుమతిగా ఇద్దాం
- వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్‌
- పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్‌, ప్రసాద్‌రెడ్డి

మడకశిర: కార్యకర్తల ఆనందోత్సాహం...ప్రజల స్వచ్ఛంద మద్దతు చూస్తుంటే మడకశిరలో ఈరలక్కప్ప గెలుపు ఖాయంగా కనిపిస్తోందని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్‌, పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్‌, ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈరలక్కప్ప నామినేషన్‌ కార్యక్రమం అనంతరం వేలాది మంది పార్టీ కార్యకర్తలనుద్దేశించి వారు మాట్లాడారు. ఈరలక్కప్ప నామినేషన్‌ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని, మడకశిరలో విజయఢంకా మోగించి జగన్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా : ఎంపీ అభ్యర్థి శాంతమ్మ

హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ మాట్లాడుతూ... మడకశిర నియోజకవర్గం నుంచి తనకు భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. తాను ఎంపీగా ఎన్నికైతే ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తానని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేసి గెలిపించాలని కోరారు.

భారీ మెజార్టీ ఇవ్వాలి: ఈరలక్కప్ప

ఈరలక్కప్ప మాట్లాడుతూ... మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌ సీపీకి భారీ మెజార్టీ రావాలని కోరారు. తాను చాలా పేదవాడినని, అయినా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తనకు టికెట్‌ ఇచ్చారని, తాను గెలిస్తే ప్రతి పేదవాడూ గెలిచినట్టేనన్నారు. వైఎస్‌ జగన్‌ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలని కోరారు. తాను ఎప్పుడూ ప్రజల సేవకుడిగానే ఉంటానన్నారు.

ఐదో రోజు 36 నామినేషన్లు

పుట్టపర్తి అర్బన్‌: నామినేషన్ల పర్వం ఊపందుకుంది. ఐదోరోజు మంగళవారం హిందూపురం పార్లమెంట్‌ నియోజకవర్గానికి 5 నామినేషన్లు, జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలకు 32 నామినేషన్లు దాఖలయ్యాయి.

- హిందూపురం ఎంపీ స్థానానికి ఎస్‌యూసీఐ (కమ్యూనిస్ట్‌) తరఫున అశోక్‌, భారతీయ పంచాయతీ పార్టీ తరఫున ఈశ్వరమ్మ, ఆర్‌ఎస్‌పీ తరఫున శ్రీనివాసులు, టీడీపీ తరఫున బీకే పార్థసారథి, స్వతంత్ర అభ్యర్థిగా రఘునాథరెడ్డి నామినేషన్లు వేశారు. కలెక్టర్‌, హిందూపురం పార్లమెంట్‌ రిటర్నింగ్‌ అధికారి అరుణ్‌బాబు వద్ద వీరంతా నామినేషన్లు దాఖలు చేశారు.
- మడకశిర అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌ సీపీ తరఫున ఈరలక్కప్ప నామినేషన్‌ దాఖలు చేశారు. రాడికల్స్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా తరఫున హనుమంతరాజు, స్వతంత్రులుగా గురుమూర్తి, కరినింగప్ప తమ నామినేషన్‌ పత్రాలను ఆర్‌ఓ గౌరీ శంకర్‌కు అందజేశారు.
- హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా స్వామి పరిపూర్ణానంద సరస్వతి, జైభీంరావ్‌ భారత పార్టీ తరఫున నాగరాజు, ఏపీఆర్‌ఎస్‌ తరఫున నౌషద్‌ తమ నామినేషన్‌ పత్రాలను ఆర్‌ఓ అభిషేక్‌కుమార్‌కు అందజేశారు.



కదిరిలో మక్బూల్‌ తరఫున నామినేషన్‌ దాఖలు చేస్తున్న నాయకులు

- రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌ సీపీ తరఫున తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, టి.శైలజ నామినేషన్‌ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోతుల నాగరాజు, రామాంజి, కిషోర్‌ కుమార్‌, కాంగ్రెస్‌ తరఫున శంకరయ్య నామినేషన్లను ఆర్‌ఓ వసంతకుమార్‌కు అందజేశారు.
- పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ తరఫున సవిత, రవికుమార్‌, స్వతంత్రులుగా నరేంద్ర, మహేష్‌, గణేష్‌ నాయక్‌ తమ నామినేషన పత్రాలను ఆర్‌ఓ అపూర్వ భరత్‌కు అందజేశారు.
- పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ తరఫున పల్లె సింధూరరెడ్డి, బీసీవైపీ తరఫున రామాంజనేయులు, స్వతంత్ర అభ్యర్థులుగా వేణుగోపాల్‌, అవుకు రఘునాథరెడ్డి, రంగనాథ్‌ నాయక్‌ తమ నామినేషన్‌ పత్రాలను ఆర్‌ఓ భాగ్యరేఖకు అందజేశారు.
- ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా బిల్లే నరేంద్ర, బీజేపీ తరఫున సత్యకుమార్‌ యాదవ్‌, నవతరం పార్టీ తరఫున షేక్‌ అయాజ్‌ తమ నామినేషన్‌ పత్రాలను ఆర్‌ఓ వెంకటశివరామిరెడ్డికి అందజేశారు.
- కదిరి అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరఫున బీఎస్‌ మక్బూల్‌, స్వతంత్ర అభ్యర్థిగా ఖాజా మైనుద్దీన్‌ నామినేషన్‌ పత్రాలను ఆర్‌ఓ సన్నీ వంశీకృష్ణకు అందజేశారు.

బడుగులకు బాబు ద్రోహం

- చంద్రబాబు క్షుద్రరాజకీయం
- నాడు మైనార్టీ నేత రహంతుల్లా చావుకు కారణం
- నేడు ఈరన్న కుటుంబానికీ అదే పరిస్థితి
- బాబు మోసాలు ఇన్నిన్ని కాదయా...



హిందూపురం అర్బన్‌: చంద్రబాబు తన స్వార్థం కోసం ఎవరినైనా బలిపీఠం ఎక్కిస్తారు. తాను పచ్చగా ఉండేందుకు ఎందరి బతుకులనైనా బుగ్గి చేస్తారు. అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగడతాడు. తన అనుయాయుల కోసం అమాయకుల ప్రాణాలు తీసేందుకూ వెనకాడరు. ఎత్తులు, పైఎత్తులతో చంద్రబాబు చేసే క్షుద్రరాజకీయానికి ఇప్పటికే ఎందరో బలైపోయారు...పోతూనే ఉన్నారు.

నాడు మైనార్టీ నేతకు ద్రోహం..

2004లో అనంతపురం అసెంబ్లీ బరిలో కాంగ్రెస్‌ తరఫున నారాయణరెడ్డి పోటీలో ఉండగా, మైనార్టీ నాయకుడు కెఎం. రహంతుల్లాకు చంద్రబాబు టీడీపీ టికెట్టు ఇచ్చారు. మైనార్టీలపై కపట ప్రేమ ఒలకబోస్తూ... తెరవెనుక తన సామాజిక వర్గానికి చెందిన ప్రభాకర్‌ చౌదరిని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిపారు. ఆ ఎన్నికల్లో నారాయణరెడ్డికి 76,059 ఓట్లు రాగా, రహంతుల్లాకు 38,278 ఓట్లు, ప్రభాకర్‌ చౌదరికి 24,084 ఓట్లు వచ్చాయి. ఓటమి జీర్ణించుకోలేని రహంతుల్లా ఏకంగా రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన చంద్రబాబు మొసలి కన్నీరు కార్చి నాటకం రక్తి కట్టించారు. కానీ విజ్ఞత కలిగిన మైనార్టీలు చంద్రబాబు మోసాన్ని కనిపెట్టారు. ఇప్పటికీ అతని విశ్వాసఘాతుకాన్ని గుర్తుచేసుకుంటూనే ఉన్నారు.

నేడు దళితునికి అన్యాయం ..

ప్రస్తుతం మడకశిరలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తే చంద్రబాబు నీచరాజకీయం ఏమిటో అందరికీ అర్థం అవుతుంది. దళితుని కన్ను దళితునితోనే పొడిపించిన బాబు రాజకీయ చతురతను చూసి తెలుగు తమ్ముళ్లే భగ్గుమంటున్నారు. వెన్నుపోటు, నమ్మక ద్రోహానికి నువ్వు నిలువెత్తు నిదర్శనం బాబూ అంటున్నారు. కొందరైతే చంద్రబాబు ఫ్లెక్సీలను చెప్పులతో కొట్టి మంటల్లో తగలబెట్టారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు డాక్టర్‌ సునీల్‌కుమార్‌కు ప్రకటించిన చంద్రబాబు బీఫాం మాత్రం స్థానికేతరుడు ఎంఎస్‌ రాజుకు ఇవ్వడాన్ని తెలుగుతమ్ముళ్లే జీర్ణించుకోలేకపోతున్నారు. పెత్తందారు గుండుమల తిప్పేస్వామికి తలొగ్గి దళితుడైన ఈరన్న కుటుంబాన్ని మోసం చేసిన చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారు.


టీడీపీలో బీసీలెక్కడ బాబూ.. ?

మడకశిరలో వైఎస్సార్‌ సీపీ ఉపాధి హామీ కూలి ఈర లక్కప్పకు సీటిచ్చింది. హిందూపురం ఎంపీ స్థానాన్ని వాల్మీకి మహిళ శాంతమ్మకు, అసెంబ్లీ స్థానాన్ని కురుబ సామాజిక వర్గానికి చెందిన దీపికకు, పెనుకొండ స్థానాన్ని కురుబ సామాజిక వర్గానికే చెందిన ఉషశ్రీచరణ్‌కు కేటాయించారు. కదిరిలోనూ మైనార్టీ వర్గానికి చెందిన మక్బూల్‌కు సీటు ఇచ్చి తమది బడుగు, బలహీన వర్గాల పార్టీ అని నిరూపించింది. అలా చెప్పుకునేందుకు మనం ఎవరికి సీట్లిచ్చాం.. బాబూ.. అని టీడీపీలోని బీసీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రచారానికి ఎక్కడికి వెళ్లినా బడుగు, బలహీన వర్గాలంతా టీడీపీలో బీసీలు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారని, వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదని టీడీపీలోని బీసీ నేతలు చంద్రబాబు వద్ద వాపోయినట్లు తెలుస్తోంది.

తమ్ముళ్ల భూ దందా

రామ్‌..లక్ష్మణ్‌. ఈ పేర్లు చెబితే చాలు క్రికెట్‌ బెట్టింగ్‌, జూదం, భూ దందా.. గంజాయి విక్రయం..ఇలా ఒకటేమిటి.. అన్నీ అసాంఘిక కార్యకలాపాలే కళ్ల ముందు కదలాడతాయి. టీడీపీకి చెందిన ఈ సోదర ద్వయం చేయని అక్రమాలు లేవు. సత్యసాయి భక్తుల భూములనూ అక్రమంగా కొట్టేసిన ఈ తెలుగు తమ్ముళ్లు.. తాజాగా రూ.20 కోట్ల విలువైన 10 ఎకరాలు కొట్టేసేందుకు ప్లాన్‌ చేశారు.

- సోదర ద్వయం.. ఆక్రమణల పర్వం
- భూ దందాల్లో ఆరితేరిన రామలక్ష్మణులు
- సత్యసాయి భక్తుల ఆస్తులు కొట్టేసేందుకు పన్నాగం
- కొత్తచెరువు సమీపంలో 10 ఎకరాలకు ఎసరు
- రూ.20 కోట్ల ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నం
- అగ్రిమెంట్‌ పొందిన వ్యక్తి అప్రమత్తతతో ఆగిన రిజిస్ట్రేషన్‌



కొత్తచెరువు సమీపంలో పుట్టపర్తి టీడీపీ నేతలు కన్నేసిన రూ.20 కోట్ల విలువైన భూమి ఇదే



అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడ్డ టీడీపీ నేతలు రామారావు,లక్ష్మీపతి (రామలక్ష్మణులు)

పుట్టపర్తి: సత్యసాయి బాబా భక్తులు స్థానికంగా కొనుగోలు చేసిన భూములపై టీడీపీ నేతలు కన్నేశారు. ఇప్పటికే పలువురు తెలుగు తమ్ముళ్లు భక్తుల భూములను సొంతం చేసుకున్నారు. తాజాగా అక్రమాల్లో ఆరితేరిన సోదర ద్వయం రామారావు, లక్ష్మీపతి (రామ్‌,లక్ష్మణ్‌) సత్యసాయి భక్తుడి 10 ఎకరాల భూమి కొట్టేసేందుకు ప్రయత్నించారు. గతంలోనూ ఈ సోదర ద్వయం భూ దందాలు, క్రికెట్‌ బెట్టింగ్‌ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. 2020లో అప్పటి ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్పీ ఈ ఇద్దరు తెలుగు తమ్ముళ్లకు గట్టిగానే కౌంటింగ్‌ ఇచ్చి రౌడీషీట్‌ సైతం ఓపెన్‌ చేశారు. అయినా వీరి తీరు మార్చుకోలేదు.

రూ.20 కోట్ల భూమిపై కన్ను..

తిరుమలదేవరపల్లి పొలం సర్వే నంబర్‌ 153–2లోని 9.68 ఎకరాల భూమి కొత్తచెరువు సమీపంలో ధర్మవరం రోడ్డు పక్కన ఉంది. ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.20 కోట్లపైమాటే. ఈ భూమిని గతంలోనే సత్యసాయి భక్తుడు తాన్‌సేన్‌ సింగ్‌ కొనుగోలు చేశాడు. ఈ భూమిని సేవా కార్యక్రమాల కోసం ఉపయోగించుకోవాలని భావించినా సత్యసాయి మరణానంతరం ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆతర్వాత ఆ భూమి ఏళ్లుగా ఎలాంటి ఉపయోగమూ లేకుండా ఉండిపోయింది. దీంతో టీడీపీ నేతలు ఈ భూమిపై కన్నేశారు. ఎలాగైనా దక్కించుకోవాలని ఎదురు చూశారు.

రిజిస్ట్రేషన్‌ వివాదాస్పదం..

శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భావం తర్వాత వైఎస్సార్‌ జిల్లా లింగాల మండలం అంబకపల్లికి చెందిన గుమ్మన మహేశ్వర్‌రెడ్డి 2022 జూలై 15న తిరుమలదేవరపల్లి పొలం సర్వే నంబర్‌ 153–2లోని 9.68 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. అయితే అంతకుముందే అంటే 2020 డిసెంబర్‌లోనే తాన్‌సేన్‌ తనకు ఈ భూమి విక్రయిస్తానని అగ్రిమెంట్‌ చేశారని తలమర్లకు చెందిన శ్యామ్‌సుందర్‌రెడ్డి కోర్టుకు వెళ్లారు. దీంతో ఈ భూమిపై ఎలాంటి క్రయ, విక్రయాలు జరపవద్దని కోర్టు స్టే విధించింది.

మహేశ్వరరెడ్డిని లోబరుచుకుని...

రూ.కోట్లు విలువైన సదరు భూమిని కాజేసేందుకు తెలుగు తమ్ముళ్లు రామ్‌, లక్ష్మణ్‌ పెద్ద కుట్ర పన్నారు. మహేశ్వర్‌రెడ్డిని లోబరుచుకొని అక్రమంగా రిజిస్ట్రేషన్‌ చేసుకునేందుకు వారం రోజుల కిందట ప్రయత్నించారు. ఈ మేరకు సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలోనూ మంత్రాంగం నడిపారు. అయితే ఈ భూమిపై అగ్రిమెంట్‌ పొందిన శ్యామ్‌సుందర్‌రెడ్డి కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ కాపీని బుక్కపట్నం సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో అందజేశారు. దీంతో ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌ ఆగిపోయింది. ఇలా ఎన్నో భూ దోపిడీలకు రామ్‌, లక్ష్మణ్‌ కేరాఫ్‌ అడ్రెస్‌గా మారారు.

టీడీపీ ప్రభుత్వంలోనే పలు కేసులు..

రామారావు, లక్ష్మీపతిలపై క్రికెట్‌ బెట్టింగ్‌, జూదం, గంజాయి విక్రయం తదితర వాటిపై టీడీపీ హయాంలోనే కేసులు నమోదయ్యాయి. దీంతో పోలీసులు వీరిపై రౌడీషీట్‌ ఓపెన్‌ చేశారు. 2020 మార్చి నెలలో అప్పటి ఉమ్మడి జిల్లా పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలునుంచి బయటకు వచ్చాకా వీరు తమ తీరు మార్చుకోలేదు. ఈజీ మనీకి అలవాటు పడి అసాంఘిక కార్యక్రమాల ద్వారా ఆస్తులు పోగుచేసుకుంటూ వచ్చారు.

మేనమామ కిట్టు సూత్రధారి..

రామలక్ష్మణుల అక్రమాలకు వీరి మేనమామ రామకృష్ణ అలియాస్‌ కిట్టు సూత్రధారి. ఈయన ఒకప్పుడు కొత్తచెరువులో క్లీనర్‌గా పని చేసేవాడు. 35 ఏళ్ల కిందట పుట్టపర్తిలో నివాసం ఏర్పరచుకున్నారు. అప్పటి నుంచి భగవాన్‌ సత్యసాయి స్వదేశీ, విదేశీ భక్తులతో పరిచయాలు పెంచుకొని వారి సొమ్ముతో ఆస్తులు కొనుగోలు చేసేవాడు. ఆ తర్వాత భక్తులను భయపెట్టి తాను చెప్పిన వారిపై రిజిస్ట్రేషన్‌ చేయించేవాడు. కొన్నాళ్లు గడచిన తర్వాత సేవా కార్యక్రమాల పేరుతో భక్తులు కొనిచ్చిన ఆస్తులను రామకృష్ణ సొంతం చేసుకునేవాడని సత్యసాయి భక్తులు చెబుతున్నారు. సేవా భావం ముసుగులో భక్తుల ఆస్తులు కొట్టెయ్యటం దారుణమంటున్నారు.

సత్యసాయి ఆరాధనోత్సవాలు ప్రారంభం

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆరాధనోత్సవాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయికుల్వంత్‌ సభా మందిరంలో జరిగిన ప్రారంభ వేడుకల్లో దేశవిదేశాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేడుకలను పురస్కరించుకుని సాయికుల్వంత్‌ సభా మందిరాన్ని అందంగా అలంకరించారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు 'ప్రేమ ఆరాధన' పేరుతో సంగీత విభావరి నిర్వహించారు. సత్యసాయిపై భక్తి ప్రపత్తులను చాటుతూ ఆయనకు ఆత్మ నివేదన చేశారు. గంట పాటు వారు ఆలపించిన చక్కటి భక్తిగీతాలతో సాయికుల్వంత్‌ సభా మందిరం మార్మోగింది. అనంతరం వేడుకల్లో పాల్గొన్న భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

మహాసమాధిని దర్శించుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట..

సత్యసాయి ఆరాధనోత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌ రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం సాయికుల్వంత్‌ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న ఆయన... ఆరాధనోత్సవాల్లోనూ పాల్గొన్నారు. అనంతరం ప్రశాంతి నిలయంలోని వినాయక, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.



సంగీత విభావరి నిర్వహిస్తున్న సత్యసాయి విద్యార్థులు

క్లుప్తంగా

నేడు తోపుదుర్తి నామినేషన్


తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నామినేషన్ వేయనున్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రాప్తాడుకు తరలిరావాలని ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది, వైఎస్ జగన్ సహకారంతో రాప్తాడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. దీనిని గుర్తించి మరోసారి ఇక్కడి నుంచే తాను పోటీ చేసేందుకు వైఎస్ జగన్ అవకాశం కల్పించారన్నారు. బుధవారం ఉదయం పది గంటలకు జరిగే నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా సత్యసాయి శ్రీగిరి రథోత్సవం


సత్యసాయి శ్రీగిరి రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమినాడు శ్రీగిరి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ ప్రశాంతినిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఈ ఉత్సవంలో దేశ విదేశీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు 'మక్బూల్' నామినేషన్

కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ గురువారం నామినేషన్ వేయనున్నారు. నానాదర్గా నుంచి భారీ ర్యాలీ చేపట్టనున్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హాజరుకానున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు.

బొంతలపల్లిలో టీడీపీ ఖాళీ


పార్టీలో చేరిన బొంతలపల్లి గ్రామస్తులతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన దొన్నికోటవారిపల్లి వాసులు


మక్బూల్ అహ్మద్ సమక్షంలో తిరిగి పార్టీలోకి చేరిన లక్ష్మేనాయక్

పుట్టపర్తి అర్బన్: బొంతలపల్లిలో టీడీపీ ఖాళీ అయ్యింది. మాజీ సర్పంచులు ఈశ్వరయ్య, ఈశ్వరమ్మతో పాటు దాదాపు 150 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రచ్చకట్ట వద్ద ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీ కుల్లాయప్ప, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, అగ్రిబోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మల్లికార్జున, పరిశీలకులు మాధవరెడ్డి, ఫొటోసాయి, మాధవప్ప, చెన్నక్రిష్ణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ టీడీపీలో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి స్వార్థ రాజకీయాలకు బలైపోయామన్నారు. తమపైనే కేసులు పెట్టించడమే కాకుండా చేసిన కాంట్రాక్టు పనులకు బిల్లులు రాకుండా ఇబ్బందుల పాలుజేశారన్నారు. తాము టీడీపీ అయినా జగనన్న సంక్షేమ పథకాలన్నీ అందాయన్నారు. గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అందుకే తాము వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. పార్టీలో చేరిన వారిలో గంగులప్ప, చంద్రశేఖర్, కుళ్లాయప్ప, రామచంద్ర, నారాయణ, నాగప్ప, వై.కుళ్లాయప్ప, వెంకటరమణమ్మ, జయమ్మ, క్రిష్ణయ్య, సోము, లక్ష్మయ్య, అవుకు శ్రీనివాసులు, చెన్నకేశవవులు, సుశీలమ్మ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఓడీచెరువు: దొన్నికోటవారిపల్లికి చెందిన పది కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో రామచంద్ర, రాజారెడ్డి, కిష్టప్ప, వెంకటనారాయణ, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, బూత్ లెవల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, దొన్నికోటవారిపల్లి హనుమంతరెడ్డి, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

ఎన్‌పీకుంట: బీజేపీ మండల కన్వీనర్ నీలం చంద్రమోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ


మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన చంద్రమోహన్‌రెడ్డి

ఎన్నికల పరిశీలకుడు వజ్రభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు.

సొంతగూటికి చేరిన వార్డు మెంబర్

కొత్తకుంటతండాకు చెందిన పదో వార్డు సభ్యుడు ఇ.లక్ష్మేనాయక్ ఆదివారం టీడీపీలో చేరి.. 24 గంటలు గడవకముందే తిరిగి సొంతగూడు వైఎస్సార్‌సీపీలోకి వచ్చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ రాఘవయ్య నాయకులు ఈశ్వర్ నాయక్, అంజి తదితరులు ఉన్నారు.

స్వప్రయోజనాల కోసమే కోటి బాబు రాజీనామా

- సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంటే బీసీలు


మాట్లాడుతున్న కుల సంఘాల నాయకులు

బత్తలపల్లి: ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు తన స్వప్రయోజనాలు కోసమే వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారని, బీసీలకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డిపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని పలు బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కురుబ సంఘం నాయకులు కమతం ఈశ్వరయ్య, బండి వీరనారప్ప, బ్యాళ్ల పెదయ్య, పామాల రమేష్, బిల్లే సూరీ, కొంకా గాంధీ, వాల్మీకి సంఘం నేత బోయ సాంబ, మైనార్టీ సంఘం నాయకులు కరీంసాబ్ విలేకరులతో మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, మండలస్థాయిలో పార్టీ పదవులు అనుభవించి, మీ కుటుంబాన్ని ఆదరించిన వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడుస్తావా? నీ స్వార్థంతో కండువా మార్చినంత మాత్రానా తాము కండువా మార్చాలా అని ప్రశ్నించారు. పార్టీకి రాజీనామా చేస్తూ సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డిని విమర్శించడంపై బీసీ కులాల నేతలు మండిపడ్డారు.

బీసీలకు అగ్రతాంబూలం

పార్టీ పదవులు, ప్రభుత్వ పరంగా, రాజకీయంగా బీసీ కులాలకు వైఎస్సార్‌సీపీ అగ్రతాంబులం ఇచ్చిందని నాయకులు తెలిపారు. బాబు, ఆయన కుటుంబాన్ని ఆదరించడంతోనే రాష్ట్ర, జిల్లా, మండలస్థాయిలో పదవులు అనుభవిస్తున్నారన్నారు. ఆయన తన వర్గీయులకు గానీ, తమ కులస్తులకు గాని మాటమాత్రంగానైనా చెప్పకుండా పార్టీ మారితే వారంతా ఆయన వెంట నడిచే స్థితిలో లేరన్నారు. కురుబ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎక్కడైనా తిరిగావా, కులంలో జరుగుతున్న అన్యాయాలను ఖండించావా అని నిలదీశారు. ఇప్పుడు కూడా బీసీలకే ఎంపీ పదవి ఇచ్చారన్నారు. సీఎం జగనన్న జిల్లాలో కురుబలకు సముచిత స్థానం కల్పించారన్నారు. కూటమి నాయకులు ప్రలోభాలకు గురికావద్దని, మళ్లీ పాత రోజులు అనుభవించాల్సి వస్తుందన్నారు. మళ్లీ సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కురుబ సంఘం నాయకులు బండి నాగభూషణ, సోమశేఖర్, కప్పల నాగన్న, కప్పల పెద్దప్ప, బిల్లే వెంకటనారాయణ, పామాల నాగభూషణ, బొంతల నారాయణస్వామి, బిల్లే పోతలయ్య, గవ్వల రమేష్, రమణ, ఆర్వేటి నాగరాజు, లింగమయ్య, కుంటాల రాము, వాల్మీకి సంఘం నాయకులు ముష్టూరు వెంగన్న, మండల నారాయణ, పెద్ద లక్ష్మన్న, మైనార్టీ నాయకులు టైలర్ బాబా, నడిమింటి షేక్షావలి, జిక్రియా, షాషు, ఎస్సీ సంఘం నాయకులు సర్పంచు దామోదర్, ఎంపీటీసీ సభ్యులు తప్పెట ఆంజనేయులు, ఎస్టీ సంఘం నాయకులు ఫక్కీరప్ప, రవీంద్ర, కాశప్ప, ఈడిగ సంఘం నాయకులు సహకార సంఘం డైరెక్టర్ ఈడిగ కాశప్ప, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు యోగానంద ఆచారీ, కుమ్మర సంఘం నాయకులు వెంకటరమణ, జాంపుల చంద్రమోహన్, చైతన్యరెడ్డి, మధుసూదనరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు నరసింహారెడ్డి, గుర్రం శ్రీనివాసరెడ్డి, జయరామిరెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

'విజయవాణి' ఉత్తమ ఫలితాలు


జి.వైష్ణవి


జి.చర్మిళ


ఎం.రిషిత


ఎం.కార్తీక్


ఎం.గణేష్

చౌడేపల్లె (చిత్తూరు జిల్లా): చౌడపల్లె మండలం విజయవాణి నగర్‌లో ఉన్న విజయవాణి ప్రైవేటు విద్యాసంస్థ విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు విజయవాణి సంస్థల కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖరమూర్తి తెలిపారు. పాఠశాలలో మొత్తం 111 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వీరిలో 110 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో జి.వైష్ణవి 583 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. అలాగే జి.చర్మిళ 577 మార్కులు, ఎం.రిషిత 572 మార్కులు, ఎం.కార్తీక్ 571 మార్కులు, ఎం.గణేష్ 571 మార్కులు సాధించినట్లు వివరించారు. మరో 36 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిరాణి, హెచ్ఎం కరుణ, అకడమిక్ అడ్వయిజర్ పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాయుని గురుప్రసాద్ అభినందించారు.

చౌడేశ్వరీదేవి ఉత్సవాలు ప్రారంభం




అమ్మవారి ఎదుట జొన్నలతో వండి రాశిగా పోసిన కూడు, కుంభకూడుకు హాజరైన భక్తజనం

- తొలిరోజు కుంభకూడుకు పోటీపడిన భక్తజనం

అమడగూరు: జిల్లాలోనే పేరుగాంచిన అమడగూరు చౌడేశ్వరీదేవి ఉత్సవాలు మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు కుంభకూడు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. చీకిరేవులపల్లికి చెందిన పళ్లెం చంద్రకళ, నరసింహప్ప దంపతులతో పాటుగా తొగటవీర సంఘం వారు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా చౌడేశ్వరీదేవి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

జొన్నల కూడు కోసం భక్తుల పోటీ

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కుంభకూడుకు ఓ ప్రత్యేకత ఉంది. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి ముత్యాల జొన్నలతో వండిన కూడును ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి ఎదురుగా రాశిగా పోసి పూల కుచ్చును ఏర్పాటు చేశారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం జంతువులను బలిగా ఇచ్చారు. పూజలు ముగిసిన తర్వాత రక్తంతో తడిసిన జొన్నల కూడును, పూల కుచ్చును తీసుకెళ్లడానికి భక్తులు పోటీపడ్డారు. జొన్నల కూడును తీసుకెళ్లి గృహాలపై, పంటపొలాల్లో, పశువులపై చల్లితే ఎలాంటి కీడు వాటిల్లదని భక్తుల నమ్మకం. అందువల్లే భక్తులు భారీగా పోటీపడతారు. కుంభకూడు కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ మగ్బూల్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పురుషోత్తమరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. లక్ష్మీచెన్నకేశవుని రథోత్సవం

- ఆకట్టుకున్న కీలు గుర్రాలు, మరగాళ్ల విన్యాసాలు


లక్ష్మీచెన్నకేశవస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు


తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రిలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం రథోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ తాడిమర్రి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. ముందుగా అర్చకులు మామిళ్లపల్లి సంతోష్‌శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10.30 గంటలకు రథంపై ఉత్సవ విగ్రహాన్ని ఉంచి మడుగు తేరు లాగారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు తిరిగి రథాన్ని లాగారు. స్థానికులతో పాటు మద్దులచెర్వు, మోదుగులకుంట, శివంపల్లి, మరవపల్లి, నిడిగల్లు, కునుకుంట్ల తదితర గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు. గోవిందా.. గోవింద అంటూ రథాన్ని లాగారు. కీలు గుర్రాలు, మరగాళ్లు, గురుమల్లయ్యల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డీజే పాటలకు చిన్నపెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా డ్యాన్సులు వేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

- క్షతగాత్రుల్లో కర్ణాటక రిటైర్డ్ ఏఎస్పీ

బత్తలపల్లి: రామాంజులపల్లి బస్‌స్టాప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక విశ్రాంత ఏఎస్పీ భాస్కర్‌రావు, ఆయన స్నేహితుడు కిరణ్ తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన మేరకు... రిటైర్డ్ ఏఎస్పీ భాస్కర్‌రావు తన స్నేహితులతో కలిసి మంగళవారం మంత్రాలయం నుంచి కదిరి నరసింహస్వామి దర్శనం కోసం కారులో బయల్దేరారు. బత్తలపల్లి మండలం రామాంజులపల్లి బస్‌స్టాప్ వద్దకు చేరుకోగానే టిప్పర్ ఢీకొనడంతో కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ భాస్కరరావుతో పాటు స్నేహితుడు కిరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని వెంటనే పోలీసులు 108 వాహనంలో ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. వీరిలో కిరణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

గ్రామాల్లో జోరుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం


గొడ్డువెలగలలో ప్రచారం చేస్తున్న నాయకులు

గాండ్లపెంట: గొడ్డువెలగల, తుమ్మలబైలు పంచాయతీల్లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, కదిరి ఎన్నికల ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సమదర్భంగా వారు గడప గడపకూ వెళ్లి ఓటర్లను కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని మీరంతా 'ఫ్యాన్'గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, బీఎస్ మక్బూల్‌అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, రాష్ట్రబీసీ కార్యదర్శి జక్కల నరసింహగౌడ్, సర్పంచ్‌లు ఆంజనేయులు, బుక్యా రవీంద్రానాయక్, ఆబ్బాఆంజనేయులు, ఆర్బీకే అధ్యక్షుడు శంకర్‌నాయుడు, మాజీ కన్వీనర్ దామోదర్‌రెడ్డి, నాయకులు అంగడిమల్లేసు, దామోదర్, గోవిందరెడ్డి, రాజన్న, వద్దిరెడ్డికృష్ణారెడ్డి, రామాంజులరెడ్డి, ప్రతాపరెడ్డి, సైదు,బాబు, ఇక్బాల్, హరిప్రసాద్‌రెడ్డి, ఫారుక్, అమానుల్లా, ఆదిబయన్న, ఆంజనేయులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం


రామప్పకుంటతండాలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

తనకల్లు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సీపీ కదిరి మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, నాయకులు సాదత్ అలిఖాన్ అన్నారు. కోటపల్లి పంచాయతీలోని గ్రామాల్లో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. సర్పంచ్ మునేనాయక్, ఎంపీటీసీ వెంకటసుబ్బమ్మ, ఏడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి, నాయకులు భక్తవత్సలరెడ్డి, శ్రీనివాసులనాయుడు, బైక్ భాస్కర్‌రెడ్డి, బీఎస్ తబ్రేజ్, పవన్‌కుమార్, బట్టీ వెంకటరమణ, రాజునాయక్, రమణనాయక్, పెద్దిరెడ్డెప్పరెడ్డి, ఈశ్వరప్ప, నరసింహులు, శ్రీనివాసాచారి, అశోక్‌రెడ్డి, తబ్రేజ్, రామ్‌దేశాయ్, చాంద్‌బాషా, సిద్దారెడ్డి, బాబా, రెడ్డెప్పరెడ్డి, ముస్తఫా, నరేంద్ర, సూరి, రెడ్డిపీరా పాల్గొన్నారు.

కదిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం


వార్డులో ప్రచారం చేస్తున్న బీఎస్ దిల్షాద్ పర్వీన్

కదిరి టౌన్: కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ సతీమణి బీ.ఎస్.దిల్షాద్ పర్వీన్ ప్రజలను కోరారు. మున్సిపల్ పరిధిలోని 12 వార్డులోని వార్డు కౌన్సిలర్ షేక్ ఖాశీం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము గంగాదేవి,మున్సిపల్ మాజీ చైర్మన్ ఫర్హానా ఫయాజ్, నాయకులు షాను,తుమ్మల మైను, అబ్దుల్, హామీద్, ఫైరోజ్, సలామ్ బీడి అదిల్, ఉమ్మర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో సత్తాచాటిన చిరు వ్యాపారి కుమార్తె


నిత్యశ్రీని అభినందిస్తున్న కాకతీయ పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: చిరు వ్యాపారి కుమార్తె టెన్త్ ఫలితాల్లో సత్తా చాటింది. సోమవారం విడుదలైన ఫలితాల్లో చిరువ్యాపారి రమేష్ కస్తూరి దంపతుల కుమార్తె, కాకతీయ విద్యానికేతన్ విద్యార్థి నిత్యశ్రీ 594 మార్కులు సాధించింది. స్థానిక కాకతీయ విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం నిత్యశ్రీతోపాటు తల్లిదండ్రులు కస్తూరి, రమేష్‌ను పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలా జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మలు అభినందించారు. నిత్యశ్రీ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

యశోద పాఠశాల విద్యార్థినికి అభినందనలు


విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: పట్టణంలోని యశోద పాఠశాల విద్యార్థిని ఆశ్రిత పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 592 మార్కులు సాధించడంతో మంగళవారం పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్‌కుమార్ అభినందించారు. విద్యార్థిని తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

బీసీల పేరుతో స్థానికేతరుల ఆధిపత్యం

ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గంలో బీసీల పేరుతో స్థానికేతరులు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రంగన అశ్వర్థనారాయణ కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేనలు అనైతిక పొత్తుతో ఎన్డీఏ అభ్యర్థిగా స్థానికేతరుడిని బరిలోకి దింపారన్నారు.

సంక్షిప్త సమాచారం

యువజన విభాగంలో పలువురికి చోటు

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ యువజన విభాగంలో కదిరి నియోజకవర్గానికి చెందిన పలువురికి చోటు దక్కింది. యువజన విభాగం జిల్లా కమిటీ వైస్ ప్రెసిడెంట్ మణిరెడ్డి సీతన, జనరల్ సెక్రెటరీ జి.లోకేశ్వరరెడ్డి, సెక్రెటరీలుగా వెంకటగిరి అవేంద్ర, లోకేష్ యాదవ్, జాయింట్ సెక్రెటరీలుగా మౌలాలి, అబుబకర్ నియమితులయ్యారు.

- వైఎస్సార్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హిందూపురం నియోజకవర్గానికి చెందిన నాగభూషణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని వెంకటాంపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సూర్యనారాయణ రెడ్డిపై టీడీపీ నాయకులు దాడి చేసి, గాయపరిచారు. మంగళవారం బాధితుడు సూర్యనారాయణ రెడ్డితో కలిసి సర్పంచ్ జయారెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వివరాలు.. ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు రానుండటంతో సోమవారం సాయంత్రం గ్రామంలోని పెద్ద వెంకటేష్ హోటల్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ జెండాలతో ద్విచక్ర వాహనాల్లో వచ్చిన యనమల గోవిందు, కనుకు హనుమంతరెడ్డి, రావుల చెరువు వెంకటరమణారెడ్డి, లింగన్నగారి రంగారెడ్డి, చింతలపల్లి మోహన్‌రెడ్డి చాకలి మల్లికార్జున, కంసల వెంకటరాముడు వెనుక నుంచి సూర్యనారాయణరెడ్డిని ఢీకొట్టారు. అనంతరం దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలో అతడి ద్విచక్ర వాహనం దెబ్బతింది. ఉద్దేశపూర్వకంగా దాడి చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు.

గోల్డు స్మిత్ ఇంట చదువుల పంట

పుట్టపర్తి: ఆయన ఓ సాధారణ గోల్డు స్మిత్. అయితేనేమి కుమార్తె మాత్రం చదువులో ప్రతిభచాటింది. వివరాలు.. బుక్కపట్నానికి చెందిన చిత్తూరి రాఘవేంద్ర కుమార్తె సౌమ్య బుక్కపట్నం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివింది. సోమవారం ప్రకటించిన 10 ఫలితాల్లో 592 మార్కులతో ప్రతిభ చాటింది. విద్యార్థిని సౌమ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు అద్భుతంగా ఉన్నాయన్నారు. సీఎం జగన్ నాడు-నేడుతో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉన్నత విద్యనభ్యసిస్తానని తెలిపారు.

బీజేపీ అభ్యర్థి నామినేషన్

ధర్మవరం అర్బన్: ధర్మవరం బీజేపీ అభ్యర్థిగా సత్యకుమార్ యాదవ్ మంగళవారం నామినేషన్ వేశారు. కేంద్ర మంత్రి విజయ్‌కుమార్ సింగ్‌తో కలిసి ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందించారు. అలాగే నవతరం పార్టీ అభ్యర్థిగా షేక్ అయాజ్, స్వతంత్ర అభ్యర్థిగా నరేంద్ర నామినేషన్లు దాఖలు చేశారు.

వలంటీర్ల రాజీనామా

తనకల్లు: సీఆర్‌పల్లి గ్రామ సచివాలయం, తనకల్లు-1 సచివాలయంలో పనిచేస్తున్న పలువురు వలంటీర్లు మంగళవారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. సీఆర్‌పల్లికి చెందిన ఆరుగురు, తనకల్లు-1 పరాకువాండ్లపల్లికి చెందిన నలుగురు వలంటీర్లు రాజీనామా పత్రాలను ఆయా కార్యదర్శులకు అందజేశారు.

24లోపు ఫీజు చెల్లించాలి

పుట్టపర్తి టౌన్: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సంబంధించిన ఫీజును కళాశాల ప్రిన్సిపాళ్లు అందరూ ఈనెల 24తేదీలోపు చెల్లించాలని ఇంటర్ విద్యామండలి జిల్లా అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా లేదా నేరుగా కూడా చెల్లించవచ్చన్నారు. ఫోన్ పే, గూగుల్ పే చేయకూడదన్నారు. 24వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ఇంటర్‌నెట్ సర్వర్లు పనిచేయవన్నారు. అందువల్ల కళాశాలల ప్రిన్సిపాళ్లు 24న సాయంత్రం లోపు ఫీజు చెల్లించాలన్నారు.